
ప్రజాశక్తి
సోమవారం 16 డిసెంబర్ 2024
5
విజయనగరం



పైడితల్లమ్మ ఆలయ అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి-విజయనగరం కోట


మంత్రి ఆనంతో చర్చిస్తున్న అశోక్ గజపతిరాజు

పైడితల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులపై దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాన్సాస్ చైర్మన్ పి.అశోక్ గజపతిరాజు చర్చించారు. విశాఖలో ఆదివారం మంత్రితో అశోక్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పైడితల్లమ్మ ఆలయ విస్తరణ పనులు, దేవాదాయ శాఖకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించారు.


గ్రీవెన్స్‌లో జెసికి సమస్య వివరిస్తున్న గజరాయునివలస ఎంపిటిసి గౌరు (ఫైల్)

సమయం లేదు మిత్రమా...! ఒక్కరోజే డెడ్ లైన్. ఆదుకుంటే ఆ మహిళ కుటుంబాన్ని నెట్టుకురావడంతోపాటు పది మందికి ఉపాధి కల్పించే వ్యాపారవేత్తగా అభివృద్ధి చెందుతుంది. లేదంటే రూ.60 లక్షల అప్పుతో దినసరి కూలీగా మారబోతుంది. అధికారులు కరుణిస్తారో? లేక చేతులెత్తేస్తారో వేచిచూడాల్సిందే. ఈ వ్యవహారం ఇప్పటికిప్పుడు తెరమీదకు వచ్చింది కాదు సుమా..!. ఏడాదిగా బాధితురాలు తిరగని చోటు లేదు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు మొదలుకుని ఆర్‌డిఒ, కలెక్టరేట్ చుట్టూ చాలాసార్లు తిరిగారు. చివరికి చేతికి అందే వ్యాపారం ఒక్కరోజు వ్యవధిలో పరిష్కరించుకోలేకపోతే చేజారిపోయే పరిస్థితి వరకు వచ్చింది. ఇది కేవలం బాధితురాలికి సవాలు మాత్రమే కాదు.... అధికారుల సమర్థతకు, ప్రభుత్వ విధానానికి బలపరీక్షగా మారింది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కుటుంబానికే న్యాయం జరగకపోతే మనలాంటి వారిని ఇంకెవరకు పట్టించుకుంటారని ఆ మండల వాసులు చర్చించుకోవడం గమనార్హం.

- ఆదుకుంటే వ్యాపారవేత్త.. జాప్యం చేస్తే రూ.60 లక్షల అప్పుతో దినసరి కూలీ
- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పదుల సంఖ్యలో వినతులు
- అధికారుల సమర్థతకు, ప్రభుత్వ విధానానికి బల పరీక్ష

సమయం లేదు మిత్రమా!

ఒక్క రోజే 'డెడ్' లైన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బాడంగి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎరుకులపాకలు గ్రామానికి చెందిన దాసరి యమున డిగ్రీ చదువుకుంది. భర్తకు చేదోడువాదోడుగా ఉండాలని భావించింది. ఎస్‌టి సామాజిక తరగతి కావడంతో ప్రభుత్వ రాయితీని ఉపయోగించుకుని పెట్రోల్ బంకు పెట్టాలని, తద్వారా పది మందికి ఉపాధి కల్పించాలని భావించారామె. అనుకున్నదే తడువుగా కుటుంబ సభ్యులందరితో చర్చించి ఏడాది క్రితమే ఇండియన్ ఆయిల్ కంపెనీకి దరఖాస్తు చేశారు. ఆ కంపెనీ నిబంధనల ప్రకారం గ్రామానికి కొద్ది దూరంలోని గొల్లాది పంచాయతీ కామన్నవలస రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 33/7లో యమున పేరున 35 సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. స్థలం కొనుగోలు, దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం, తదితర సదుపాయాల కల్పనకు రూ.60 లక్షల వరకు పెట్టుబడి అయింది. అంతా సాఫీగా సాగుతుందన్న సమయంలో సరిగ్గా అసలు సమస్య మొదలైంది.

ఏడాది క్రితం కామన్నవలస రెవెన్యూ గ్రామంలో జగనన్న సమగ్ర శాశ్వత భూ సర్వేలో తీవ్రమైన లోపాలు తలెత్తాయి. ఈ రెవెన్యూ పరిధిలో మొత్తం 217 సర్వే నంబర్లు ఉండగా, వీటిని 1121 నంబర్లుగా నమోదు చేశారు. దాదాపు 904 సర్వే నంబర్లు ఎక్కువ వచ్చాయి. సర్వే తప్పుల తడకగా ఉండడంతో జిల్లా స్థాయి అధికారులు ఈ రెవెన్యూ పరిధిని హోల్డ్ చేశారు. దీంతో ఏడాదిగా వన్‌బిలు కూడా రాని పరిస్థితి. యమునతోపాటు ఈ ఊరందరినీ రెవెన్యూ సమస్యలు చుట్టుముట్టాయి. అందరి సమస్యలు కాస్తా పక్కన పెడితే.... వన్‌బి లేకపోవడంతో యమున పేరిట ఉన్న స్థలంపై ఇండియన్ కంపెనీతో లీజు ఒప్పందం కుదుర్చుకోవడానికి వీలు కుదరలేదు. దీంతో యమున, ఆమె కుటుంబ సభ్యులు కలిసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏడాదిగా మండల, డివిజన్ స్థాయిలో వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. చివరికి జెసి, కలెక్టర్ లాగిన్ ద్వారానే ఈ సమస్య పరిష్కామౌతుందని తెలియడంతో నెల రోజులుగా బాధితులు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ఇండియన్ ఆయిల్ కంపెనీ యాజమాన్యం కూడా తమతో స్థలం లీజు ఒప్పందం వెంటనే కుదుర్చుకోకపోతే దరఖాస్తు రద్దు చేయబడుతుందంటూ హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. దీంతో రూ.లక్షల్లో అప్పు చేసిన ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురౌతోంది. ఈ నెల 9న (గత సోమవారం) కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో బాధితురాలి తరపున గజరాయునివలస ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు.. జెసికి వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాల్సిందిగా బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన కూడా మౌఖికంగా సిఫార్సు చేశారు. మరోవైపు ఈ నెల 17వ తేదీ (మంగళవారం)లోపు లీజు ఒప్పందం కుదుర్చుకోకపోతే దరఖాస్తు రద్దుచేయబడుతుందంటూ బాధితులకు ఇండియన్ కంపెనీ నుంచి తాఖీదు అందింది. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించకపోతే తాము పెట్రోల్ బంకు పెట్టుకునే అవకాశం కోల్పోయిట్టేనని, ఇప్పటికే రూ.60 లక్షల వరకు పెట్టుబడి కూడా పెట్టేశామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ కుటుంబానికే దిక్కులేదు

యమున ఎదుర్కొంటున్న సమస్యను చూసి, 'రాజకీయ కుటుంబానికే దిక్కులేకుండా పోయింది..... మనమెంత' అంటూ బాడంగి మండలంలోని పలువురు వ్యాపారులు, యువతీ, యువకులు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి యమున రాజకీయ కుటుంబానికి చెందినవారే. ప్రస్తుతం ఆమె మామ (భర్త తండ్రి) గజరాయునివలస ఎంపిటిసి సభ్యునిగా ఉన్నారు. సుదీర్ఘకాలంగానే ఆయన అధికార పార్టీలో కొనసాగుతూ ఈ ప్రాతంలో రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. యమున సొంత అత్త పాలవలస పార్వతి కూడా ప్రస్తుతం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచిగా ఉన్నారు. దీనికితోడు ప్రస్తుత సమస్యపై ఈ కుటుంబం స్థానిక ఎమ్మెల్యే బేబినాయన దృష్టిలో పెట్టింది. అయినా అటు ప్రజాప్రతినిధులు గానీ, ఇటు అధికారులు గానీ అదుగో ఇదిగో.. అంటున్నారే తప్ప పరిష్కారం చూపడం లేదన్నది జనం మాట.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మణరావు

హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాల్సిందే

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ల (పురుష ఆరోగ్య కార్యకర్తలు)ను తొలగించడం అన్యాయమని, వారందరినీ కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్‌పి ప్రాంగణంలోని మినిస్టీరియల్ భవనంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యాన జెవి ప్రసాద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఏనాటికైనా రెగ్యులర్ చేస్తారన్న ఆశతో ఎదురుచూస్తూ, అరకొర వేతనాలతో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అరకొర వేతనాలు సైతం సరిగా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణా హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో 926 మందిని, జిల్లాలో 56 మంది ఆరోగ్య సహాయకులను తొలగించడం సరికాదన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని తెలియగానే గుంటూరులో కొల్లి లక్ష్మణరావు, తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగం కోల్పోయిన హెల్త్‌అసిస్టెంట్ ఒవిఎం నెహ్రూ తండ్రి ఒగ్గు ఆశీర్వాదం గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ చర్య వల్ల సంభవించిన రెండు మరణాలకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు బాధ్యత వహించి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలకు ఉద్యోగులు బాధ్యులు కాదని స్పష్టంచేశారు. అలాంటి తరుణంలో వారిని తొలగించడం సరికాదని అభిప్రాయ పడ్డారు. తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి జివిఎన్ఎస్ఎన్ మూర్తి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు టిబిఎస్ వర్మ, ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు ఎ.కనకరాజు , ఫార్మాసిస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి ప్రసాద్ , గవర్నమెంట్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్‌బాబు, సీనియర్ ఎఎన్ఎంల సంఘం నాయకులు డి.పద్మావతి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల జెఎసి రాష్ట్ర కో-చైర్మన్ బి.కాంతారావు, 108 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.అప్పలనాయుడు, కంటింజెంట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.దుర్గారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.అప్పలసూరి, వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల విభాగం నాయకులు జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

ఘనంగా గురజాడ యువ చైతన్యోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గిడుగు రామమూర్తి తెలుగు భాష జానపద కళాపీఠం, గురజాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన గురజాడ యువ చైతన్య ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జానపద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు మాట్లాడుతూ గురజాడ స్ఫూర్తి రెండు శతాబ్దాల ముందు చూపు అన్నారు. తెలుగు సాహిత్యానికి దశ, దిశ నిర్దేశించిన దార్శనికుడు గురజాడ అని కొనియాడారు. కన్యాశుల్కాన్ని హాస్యరస ప్రధాన నాటకంగా మలచడంలో గొప్ప నైపుణ్య ప్రదర్శించారని ప్రముఖ అనువాద రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి కొనియాడారు. గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు కొవ్వలి గోపాలకృష్ణ మాట్లాడుతూ గురజాడ.. కమ్యూనిస్టులకు కార్ల్‌మార్క్స్‌గానూ, అభ్యుదయ వాదులకు అగ్రజుడుగానూ, ఛాందసులకు సత్యవాదిగానూ కనిపిస్తారని తెలిపారు. రామసూరి, జి.ఎస్.చలం, తుంబలి శివాజీ, పి. స్వప్న హైందవి, పి.వి.పద్మనాభం మాట్లాడుతూ గురజాడ సాహిత్యం తెలుగు భాష ఉన్నంతకాలం ఉంటుందని ప్రశంసించారు. కొవ్వలి గోపాలకృష్ణ సంపాదకత్వంలోని మహాకవితా ఖండికలు, మీ పేరేమిటి గురజాడ, ఇతర కథానికలు, ప్రకాశిక గ్రంథాలు ఆవిష్కరించారు. తొలుత గురజాడ దేశభక్తి గేయాన్ని చీకటి చంద్రిక, పి.కళ్యాణి శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో రత్నాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు.. పొట్టి శ్రీరాములు

మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరంకోట


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి , ఎంపి, కలెక్టర్

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆయన త్యాగనిరతిని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం ఘనంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు.. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాటం చేసి, మనకు ప్రత్యేక గుర్తింపును తేవడానికి ప్రాణత్యాగం చేసిన దేశభక్తుడని కొనియాడారు. శ్రీరాములు ఆశయాలను, స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ మరణించి కూడా అమరజీవిగా నిలిచిపోయారంటే పొట్టి శ్రీరాములు త్యాగం గొప్పదనం తెలుస్తుందన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ సమాజం తర్వాతే మనమని ఆలోచించిన వ్యక్తి పొట్టి శ్రీరాములని, ఆంధ్రులను తలెత్తుకొని తిరిగేలా చేసిన గొప్ప దేశ భక్తుడని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, బిసి సంక్షేమ అధికారి పెంటోజీరావు, డిఇఒ మాణిక్యంనాయుడు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిపిఒ వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ కూర్మినాయుడు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

17న పింఛనుదారుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అఖిల భారత పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న జరిగే వేడుకలను విజయవంతం చేయాలని పింఛనుదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, జి.నారాయణరావు కోరారు. ఆదివారం స్థానిక పింఛనుదారుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 17న జరిగే కార్యక్రమానికి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఖజానా శాఖాధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ నల్లనయ్య ఆదివారం పర్యటించారు. పారిశుధ్య కార్యకలాపాలను పర్యవేక్షించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ నగరం పరిశుభ్ర వాతావరణంలో ఉండేలా చూడాలన్నారు. ఇప్పటికే సచివాలయాల వారీగా ప్రత్యేక వాహనాలను కూడా అందించామని ఆయన తెలిపారు.



సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సాబ్జీ ఆశయ సాధనకు పునరంకితం

యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు షేక్ సాబ్జీ ఆశయ సాధనకు పునరంకితం అవుదామని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ప్రథమ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన రాష్ట్ర నాయకులు డి.రాము పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం సాబ్జీ కృషి చేశారని కొనియాడారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలియజేసి, వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ మరణించడం విచారకరమన్నారు. సాబ్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి రాంప్రసాద్, సోషల్ మీడియా సబ్ కమిటీ కన్వీనర్ కె.అప్పారావు, బొండపల్లి, విజయనగరం మండలాల అధ్యక్షులు బి.గణేష్, పి.శ్రీనివాస్, పి.వెంకట్రావు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్ ; బైక్ విన్యాసాలు చేస్తున్న ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

సమిష్టితత్వంతో శాంతిభద్రతల పరిరక్షణ

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-డెంకాడ

సమిష్టితత్వంతో శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేయాలని ఎస్‌పి వకుల్ జిందాల్.. ఐదో బెటాలియన్ పోలీసులకు సూచించారు. చింతలవలస వద్దనున్న ఎపిఎస్‌పి ఐదో బెటాలియన్ మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి, జట్లకు బహుమతులను, పతకాలను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఐదో బెటాలియన్ పోలీసుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రదర్శించిన స్పోర్ట్స్ మెన్ స్పిరిట్‌ను మన జీవితానికి అన్వయం చేసుకోవాలన్నారు. క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో వివిధ పోలీసు జట్లు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎపి ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది బైకులతో నిర్వహించిన సాహస విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ బాపూజీరావు, రమణమూర్తి, శ్రీనివాస్, గోపాలకృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జి.రవీంద్ర, ఎం.శ్రీనివాసరావు, దానయ్య, నూకరాజు, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

నగరంలోని రింగ్‌రోడ్డులో ఉన్న ఫైర్ చెస్ స్కూల్లో ఆంధ్రా చెస్ అసోసియేషన్ సిఇఒ కెవి జ్వాలాముఖి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఏడో రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పైల రమేష్‌రాజు ప్రారంభించారు. వివిధ కేటగిరీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 6 నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు ఉన్న విద్యార్థులకు నాలుగు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెస్ శిక్షకులు కర్రోతు ధనలక్ష్మి, జిల్లా నాయకులు ఎం.గణేష్ నాయుడు, ఎ.దామోదర్‌రావు, పద్మ, అర్చన పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచేందుకు

100 రోజుల ప్రణాళిక



పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యం • 'ప్రజాశక్తి'తో డిఇఒ మాణిక్యం నాయుడు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికను డిసెంబర్ ఒకటో నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లో అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి యు.మాణిక్యం నాయుడు తెలిపారు. దీనిద్వారా విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఏకాగ్రతను పెంచడమే ధ్యేయమన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాల కోసం అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక గురించి ఆ ఇంటర్వ్యూలో వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

పదో తరగతి ఫలితాల మెరుగుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాం. ఆయా సబ్జెక్టు టీచర్లకు ఆ బాధ్యతలు అప్పగించాం.



వంద రోజుల ప్రణాళిక ముఖ్య ఉద్దేశం ఏమిటి.?

పదో తరగతిలో ఫలితాల మెరుగే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళిక అమలుచేస్తున్నాం. విద్యార్థికి ఉపాధ్యాయులను దగ్గర చేయడంతోపాటు వారికి ఆ సబ్జెక్టులో ఉన్న అనుమానాలు నివృత్తి చేయడం, పూర్తి అవగాహన కల్పించడం, సబ్జెక్టు పట్ల భయాన్ని పోగొట్టి విద్యార్థిని పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ప్రణాళిక అమలవుతోంది.

వంద రోజుల ప్రణాళిక ఎప్పటి నుంచి ఎప్పటి వరకు అమలు చేస్తున్నారు.?

వంద రోజుల ప్రణాళిక అమలు డిసెంబర్ ఒకటో తేది నుంచే ప్రారంభమైంది. మార్చి పదో తేదీ వరకు అమలవుతుంది. ఇది ప్రధానంగా వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రణాళికలో ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయుడు రెండు గంటల పాటు విద్యార్థితో ఉండటం వల్ల వారిలో ఏకాగ్రత పెంచేందుకు, వెనుకబడిన విద్యార్థులు మరింత మెరుగుపడేందుకు, మార్కులు అధికంగా తెచ్చుకునే అవకాశం ఉంటుంది. వంద రోజుల ప్రణాళిక అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, కెజిబివిలు, మోడల్ స్కూళ్లలో అమలు చేస్తున్నాం.

ప్రణాళిక ఎలా అమలవుతోంది.?

ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్లాన్ ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి రోజుకు ఒక సబ్జెక్టు చదివించడం, దీనిపై సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం సాగుతోంది. ప్రతి రెండు గంటలకు చదివిన అంశాలపై రిమైండర్ చేసి, అప్పటి వరకు ఉన్న అనుమానాలు నివృత్తి చేస్తారు. ఉపాధ్యాయుడు ఎక్కువ సమయం విద్యార్థితో ఉండేలా ప్రణాళిక అమలవుతోంది.

వంద రోజుల ప్రణాళిక సెలవు రోజుల్లో కొనసాగడం వల్ల వసతి గృహ విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందనే వాదన వినిపిస్తోంది. దీనిపై మీ సమాధానం.?

ఆదివారం కూడా ప్రణాళిక అమలు చేస్తున్నాం. వసతిగృహ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ లేదు. ఒక వేళ ఆదివారం దుస్తులు శుభ్రం చేసుకునే అవకాశం ఉంటే ఉదయం 8 గంటల లోపు ఆ పని ముగించుకునే వెసులుబాటు ఉంది. లేదంటే సాయంత్రం అయినా చేసుకోవచ్చు. ఇది సరైన కారణం కాదు.

పదో తరగతి సిలబస్ పూర్తయిందా.?

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ, సోషల్ తప్ప అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తయింది. హిందీ, సోషల్ కూడా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం.

ఈ ఏడాది ఎంతమంది విద్యార్తులు పరీక్షలు రాయనున్నారు.?

ఈ ఏడాది జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 23,165 మంది, ప్రయివేటు విద్యార్థులు 770 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

మెరుగైన ఫలితాల కోసం చేపట్టిన చర్యలు ఏమిటి.?

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పదో తరగతి విద్యార్థులకు వారి సామర్థ్యాలను బట్టి బోధన చేస్తున్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు ఆ బాధ్యత తీసుకొని వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఏ సబ్జెక్టులో వెనుక బడి ఉన్నారో దాన్ని గుర్తించి, బోధన పునరావృతం చేయడం, రాయించడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. దీంతోపాటు ప్రశ్నపత్రాలు ఆధారంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం.



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రమాదాలను నివారించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి- బొబ్బిలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు కోరారు. శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం లారీ, ట్యాక్సీ, ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని కోరారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. అన్ని రకాల పత్రాలు ఉన్న వాహనాలను మాత్రమే నడపాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నేరాలు నివారణకు అనుమానిత సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఎస్ఐలు జ్ఞానప్రసాద్, రమేష్, శ్రీహరి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - బొబ్బిలి

జమ్మూ కాశ్మీర్ లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద 30 మంది జవాన్ల ప్రాణాలను కాపాడి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన హవల్దార్ వి.సుబ్బయ్యకు మాజీ సైనికులు వారి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద 30మంది జవాన్లతో పెట్రోలింగ్ చేస్తుండగా సుబ్బయ్య ల్యాండ్ మైన్‌పై కాలు వేయడంతో గుర్తించి తోటి జవాన్లను అప్రమత్తం చేసి జవాన్లు వెళ్లిపోయిన తర్వాత ల్యాండ్ మైన్ పై కాలు తీసి దేశం కోసం ప్రాణ త్యాగం చేశారన్నారు. జవాన్ల త్యాగాలను మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సభ్యులు రెడ్డి రామకృష్ణ, అలుగోలు గోవిందనాయుడు, ఎన్ఆర్ మోహన్ రావు, ఎంఎల్ రావు, పి.సురేష్‌బాబు, సిహెచ్ త్రివేది, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ



స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నుంచి రెండు రోజులు పాటు గ్రామ స్వరాజ పరిపాలన అమలు గూర్చి సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపిడిఒ సిహెచ్. సూర్యనారాయణ తెలిపారు. సోమవారం, మంగళవారాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణకు సర్పంచులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - మెరకముడిదాం

మండలంలోని గాదెల మర్రివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన పైడితల్లి అమ్మవారి మూర్తి స్థాపన కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న నాయకులు

నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడలో ఆదివారం నిరుపేదలకు రగ్గులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేపట్టారు. స్వచ్ఛందంగా నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్న పాండ్రంకి సత్యనారాయణ అలియాస్ (చిరంజీవి) తమ ఖర్చులతో నిత్యావసర వస్తువులు, రగ్గులు కొనుగోలు చేసి నిరుపేదలయిన వృద్ధులకు గ్రామ పెద్దలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెంటాడ నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజగోపాల్, మండల విజయ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, గొరజాన అప్పలనాయుడు, ముప్పిడి కృష్ణ, పి వెంకటేశ్వరరావు, ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పికే మద్యాన్ని అమ్మాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకే మద్యాన్ని అమ్మాలని ఎక్సైజ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. పట్టణంలో ఉన్న బార్, వైన్ షాపులలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పి ధరల బోర్డులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు మద్యాన్ని అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. అధిక ధరలకు అమ్ముతూ మూడు సార్లు పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రతి షాపు వద్ద ఎమ్మార్పీ ధరల బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మద్యం అమ్మకాలపై కొనుగోలు దారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

సిఐను అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి- బొబ్బిలి

జాతీయ లోక్ అదాలత్‌లో 438 కేసులను రాజీ చేపించిన పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌ను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు. స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఐపిసి కేసులు 59, పెట్టి కేసులు 379 రాజీ చేయడంతో జిల్లాలో అత్యధికంగా బొబ్బిలి పోలీసు స్టేషన్ నుంచి రాజీ అయ్యాయి. దీంతో సిఐ సతీష్ కుమార్‌ను ఆయన అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

దేశ రక్షణలో యువతదే కీలకపాత్ర

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశ రక్షణలో యువత కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. పారా మిలటరీకి ఎంపికైన యువత ఆదివారం కోటలో బేబినాయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో యువత కీలకపాత్ర పోషించాలని, రక్షణ రంగంలోకి యువత వెళ్లాలన్నారు. వీర బొబ్బిలి క్రీడా మైదానంలో ఉచిత శిక్షణ తీసుకున్న వారిలో ఏడుగురు ఉద్యోగాలు సాధించినట్లు కోచ్ రావు శ్రీనివాసరావు చెప్పారు. ఉచిత శిక్షణ ఇస్తున్న శ్రీనివాసరావును బేబినాయన అభినందించారు.

కూటమి ప్రభుత్వం విఫలం : సిపిఐ

రామభద్రపురం: గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి అలమండ ఆనందరావు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ ఒక్క నోటిఫికేషన్ కూడా వేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ స్థానిక నేతలు లెంక లక్ష్మీ, కామిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

ప్రజాశక్తి- బొబ్బిలి

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు, సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహావీరుడు పొట్టి శ్రీరాములు అని రామలక్ష్మి, కౌన్సిలర్లు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జామి: పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం అన్నంరాజుపేట పంచాయతీ కార్యాలయంలో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎన్నింటి శేషు, టిడిపి నాయకులు అప్పలరాజు, కార్యదర్శి జగదీశ్, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ కె. అప్పలరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల: చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమిషనర్ తదితరులు



జామి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

శృంగవరపుకోట: అమరజీవి పొట్టి శ్రీరాములు 77వ వర్ధంతిని పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ పార్క్ ఆవరణలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోవింద్ ప్రకాష్ శర్మ, ఉపాధ్యక్షుడు గనివాడ బాపునాయుడు, సంయుక్త కార్యదర్శి హనుమాల శెట్టి నానాజీ, గేదెల శ్రీను, చింతాడ రమణమూర్తి, సురేష్ రాజు, శంకర్, సన్నిబాబు, కాకి వీరరెడ్డి, బొబ్బిలి అప్పారావు, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మహేష్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పొట్టి శ్రీరాములుకు ఎఒ రఘునాథ చార్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆర్ గోపాలరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.గిరిబాల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపిపి చల్ల చలంనాయుడు, తహశీల్దార్ రాజేశ్వరరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ పూలమాల వేసి అంజలి ఘటించారు. బాలాజి నగర్‌లోని జనసేన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటాలకు జనసేన నాయకులు అవనాపు విక్రమ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పత్తిగిల్లి వెంకటరావు, సంపత్ ఈశ్వరరాజు, ఎర్నింటి నరసింహారావు, ముని లక్ష్మణరావు, షేక్ మారేష్ పాల్గొన్నారు.

విజయనగరంకోట : జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎఆర్ ఎఎస్‌పి జి.నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, పి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు ఎ.రామకృష్ణ, టి.రామారావు, ముబారక్ అలీ, సి. హెచ్.మహేష్, ఎస్.వి.ఆర్ పాత్రో పాల్గొన్నారు.



విజయనగరం: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్

రైతుల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రైతుల సంక్షేమమే ధ్యేయంగా సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టిసి మెంబర్లు పనిచేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయంలో సాగునీటి సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్ష టిసి మెంబర్లను ఆమె సత్కరించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని 85 సాగునీటి సంఘాలకు పారదర్శకంగా ఎన్నికల నిర్వహించారని, ఇందులో టిడిపి మద్దతుదారులు 75 మంది అధ్యక్ష, ఉపాధ్యక్ష, మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికవడం గొప్ప విషయమన్నారు. నియోజకవర్గంలో భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, టిడిపి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నీటి సంఘం అధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

సుపథ ప్రతిభా పరీక్షల నిర్వహణ గొప్ప విషయం

మాతృభాషా, సంస్కృతి సాంప్రదాయ, మానవతా విలువల పరిరక్షణ లక్ష్యంగా ఏటా సుపథ సేవా సంఘం నిర్వహిస్తున్న సుపథ ప్రతిభా పరీక్షల నిర్వాహకులను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అభినందించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో గల బాలిక హై స్కూల్లో నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. అనేక మంది సహకారంతో చిన్నారులందరకు విలువలు, సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాలని కృతనిశ్చయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీహరి శర్మ, భాస్కర్ శర్మని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల టిడిపి అధ్యక్షులు జీఎస్.నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు సాయిరాం, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, నాయకులు అనకాపల్లి చెల్లయ్య, రాజేంద్ర, హైటెక్ సురేష్, పెదగాడ రాజు, బోనంగి జ్యోతి, బోత్తల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం అధ్యక్షులకు ఎమ్మెల్యే అభినందన

వంగర: ఇటీవల జరిగిన మడ్డు వలస, మధ్య తరహా నీటి పారుదల, వినియోగదారుల సంఘ అధ్యక్షులుగా అరసాడ గ్రామానికి చెందిన తుమ్మి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులుగా సంగాం గ్రామానికి చెందిన యడ్ల శ్రీరాములు నాయుడు ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ వారిని ఆదివారం అభినందించారు. అరసాడ సుబ్బి చెరువు సంఘ అధ్యక్షులుగా దొంతల దుర్గారావు, ఉపాధ్యక్షులుగా బోను జోగినాయుడులను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి, జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి మోహన్ రావు, నాయకులు లచ్చభక్తుల కృష్ణమూర్తి, మజ్జి గణపతి, బెజ్జి పురపు రవి, మజ్జి శ్రీను, చింత అప్పలనాయుడు, మజ్జి వెంకట నాయుడు, తుమ్మి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాకర్ల పూడిని కలిసిన నీటి సంఘం అధ్యక్షులు

భోగాపురం: జనసేన పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజును భోగాపురం గ్రామానికి చెందిన నీటి సంఘం అధ్యక్షులు వరుపుల గిరి శనివారం రాత్రి కలిసారు. డెంకాడ ఆయుకట్టు ఛానల్ సిస్టం -3కి ఏకగ్రీవంగా జనసేన పార్టీ తరపున ఎన్నికయ్యారు. ఎన్నికైన గిరిని శ్రీనివాసరాజు అభినందించారు. రైతులకు అందుబాటులో ఉండి సాగునీరు అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, జి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమనేత షేక్ సాబ్జీకి ఘన నివాళి

బొబ్బిలి: అమరజీవి పొట్టి శ్రీరాములు, ఐక్య ఉపాధ్యాయ ఉద్యమ నేత షేక్ సాబ్జీకి యుటిఎఫ్ నాయకులు ఆదివారం ఘన నివాళులర్పించారు. యుటిఎఫ్ బొబ్బిలి డివిజన్ ఆధ్వర్యంలో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు, ఐక్య ఉపాధ్యాయ ఉద్యమ నేత పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ వర్ధంతి సభ టి.పి.మున్సిపల్ స్కూలు లో జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి పాల్గొని మాట్లాడారు. తెలుగు భాషా మాట్లాడేవారికి ఆంధ్ర రాష్ట్రం కావాలని, భాషా ప్రయుక్త రాష్ట్రాలు గా ఏర్పాటు కావాలని 53 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్షలు చేసి ప్రాణాలను అర్పించిన రోజు ఇది అని, అటువంటి భాషా ప్రయుక్త రాష్ట్రాలను కాపాడుకోవడమే పొట్టి శ్రీరాములుకు అర్పించే ఘనమైన నివాళులు అని అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉద్యమ నేత, పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి విద్యారంగానికి ఉపాధ్యాయులకు తీరని లోటు అని అన్నారు. ఆయన ఆశయాలు అమలు చేయడం ప్రస్తుతం కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేశవరావు, పి. సత్యన్నారాయణ, బొబ్బిలి రూరల్, టౌన్, రామభద్రపురం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాములు, సాబ్జీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దుర్భరంగా రైల్వే ప్రయాణాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లా నుంచి కొన్ని వేలమంది చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధానమైన నగరాలకు కూలి పని కోసం నిత్యం పేదలు రైలు ప్రయాణం చేస్తారని ఆ రైలు ప్రయాణం ఎంత దుర్భరంగా ఉంటుందో ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు అన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాదు విజయవాడ నుండి విశాఖపట్నం మీదుగా వచ్చే ట్రైన్లు రెండే జనరల్ బోగీలు పెడతారన్నారు. ఈ భోగిల్లో 500 నుంచి 1000 మంది వరకూ కిక్కిరిసిపోయి ప్రయాణం చేస్తున్నారన్నారు. సుమారు 12 నుంచి 15 గంటల వరకు జర్నీ చేస్తున్నారని, జనరల్ బోగీలు ఎక్కలేక పక్కనే ఉన్న స్లీపర్ కోచ్ ఎక్కితే టీసీలు పేదలనే కనికరం లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మోడీ మాత్రం దేశం వెలిగిపోతుంది.. అభివృద్ధి చెందిపోతుంది.. అని ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్తారు. మన ప్రజల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో జనరల్ బోగీలో ప్రయాణం చేసే ప్రజలని చూస్తే తెలుస్తుంది.' అని చెప్పారు. ఈ ప్రధానమైన నగరాలకు జనరల్ బోగీలతో ట్రైన్స్ వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కానీ మన పాలకులు ప్రజలంటే పేడ పురుగుల కంటే హీనంగా చూస్తున్నారని, సాధారణమైన ప్రజల కోసం జనరల్ బోగీలతో పట్టణాలకు ట్రైన్లు వేయాలని గట్టిగా డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ దుర్భరమైన ప్రయాణంతో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని భయంకరమైన పరిస్థితి ఉందని అన్నారు. విజయవాడ నుంచి తాను ఇటీవల బొబ్బిలి తాంబరం ఎక్స్‌ప్రెస్‌లో వస్తే కూర్చోవడానికి కాదు కదా నిలబడటానికి కూడా రైల్లో కనీసం చోటు లేదని బొబ్బిలి వరకు ఒంటి కాలు మీద నిలబడి రావలసిన పరిస్థితి వచ్చిందని ఆగ్రహించారు. ప్రజల ఓట్లతో గెద్దనెక్కిన పాలకులకు ప్రజలు బాధలు పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి జనరల్ భోగిలతో ప్రధాన పట్టణాలకు ట్రైన్స్ వేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు రైల్వే సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీతో కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన చెప్పారు.

కార్మికవర్గ ఐక్యతతోనే హక్కులు సాధ్యం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి- రాజాం

కార్మిక వర్గ ఐక్యతతోనే హక్కులు సాధ్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో సిఐటియు పూర్వ నాయకులు ఎం.తిరుపతిరావు అధ్యక్షతన కార్యకర్తలకు, సిఐటియు నాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యత - పోరాటం నినాదంతో 1970లో ఏర్పడిన సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా ఎదిగిందని, 1981 నుంచి కార్మిక సంఘాలను ఐక్యం చేసి దేశవ్యాప్తంగా 19 సమ్మెలు నిర్వహించిన చరిత్ర సిఐటియుకు ఉందని గుర్తు చేశారు. సిఐటియు ఒక వ్యక్తి సంఘం కాదని, సంఘటిత శక్తి అని, తప్పు చేస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదని అన్నారు. ప్రజల పైన భారాలు వేస్తున్న ప్రభుత్వాలకు సంపన్నులపై పన్నులు వేసి పన్నులు వసూలు చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. బిజెపి నాయకత్వంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం 6.30 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడిదారులకు రాయితీ ఇచ్చిందని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న పది సంవత్సరాల కాలంలో ఎక్కడైనా ఒక పరిశ్రమ నైనా నెలకొల్పారా అని ప్రశ్నించారు. పైగా కేంద్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి రైల్వే, బ్యాంకులను, పోర్టులను అదాని, అంబానీలకు విదేశీ సంస్థలకు అమ్మేసి ప్రజలపై భారాలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం పై ప్రశ్నించడం లేదు కాదు కదా, కేంద్రం చేసే నిర్ణయాలను అన్నిటినీ రాష్ట్రంలో అమలుకి ప్రయత్నిస్తుందన్నారు. అదాని అవినీతిపై, స్మార్ట్ మీటర్లపై కూటమి ప్రభుత్వం వైఖరి వివరించలేనిదని అన్నారు. చిరు ఉద్యోగులైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, విఆర్ఎ, విఆర్ఒ, గ్రీన్ అంబాసిడర్, మున్సిపల్ కార్మికుల ఉద్యోగులపై కక్ష సాధింపులు తొలగింపులకు పాల్పడుతుందని, ఈ వైఖరి మార్చుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాల సవరణ చేయాలని డిమాండ్ చేశారు. నెలలు తరబడి జీతాలు బిల్లులు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్ రావు, నాయకులు ఏ జగన్మోహన్‌రావు, బి సుధారాణి, విఆర్ఏ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రాంతీయ నాయకులు త్రినాథ్, అసలప్పుడు, పెంటయ్య, కంచినాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్

ప్రజాశక్తి- రేగిడి

బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం కొమిరి పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. సమాజంలోని అసమానతలను తొలగించేలా చట్టాలను రాజ్యాంగంలో పొందు పరిచిన మహా మేధావి అని కొనియాడారు. రాజ్యాంగమంటే కేవలం ప్రభుత్వ విధివిధానాలు, శాసనసభల రూపకల్పనే కాదని, కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింబించాలన్నది ఆయన ప్రధానా ఆశయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జరజాన నీలయ్య, విశ్రాంతి తహశీల్దార్ దేబారికి రామప్పడు, బిఎస్‌పి ఇన్చార్జ్ బొత్స బుద్ధుడు, పేకేటి రామారావు, తేగల మోహన్, టిడిపి మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కేత శంకర్రావు, రమణ, మెండ అప్పన్న, వాల్తేటి రవి, యువజన సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున అంబేద్కర్ వాదులు, నాయుకులు పాల్గొన్నారు..



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్

రాజాం సమగ్ర అభివృద్ధికి కృషి

రాజాం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. ఆదివారం రేగిడి ఆమదాలవలస తారురోడ్డుకు రూ. 70 లక్షల రూపాయల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అక్షరాస్యత, పరిశుభ్రత స్వచ్ఛత, మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. గత ఐదేళ్ల పాలనలో పంచాయతీ నిధులు రూ.13వేల కోట్లను దారి మళ్లించి పల్లెలను, గ్రామ పరిపాలనను వైసిపి నిర్వీర్యం చేసిందన్నారు. గాడితప్పిన పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు 15వ ఆర్థికసంఘం నిధులతో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోండ్రు జగదీష్, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, దుప్పలపూడి శ్రీనివాస రావు, గురవాన నారాయణ రావు, ధనుంజయ్, రమేష్, మజ్జి శ్రీను, బెవర రాంబాబు, కడగల నాగరాజు, జయరాం, రాజేష్, పాల్గొన్నారు.

విఆర్‌ఒలు పనితీరు మార్చుకోవాలి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

ప్రజాశక్తి- బొండపల్లి

రైతులకు సంభందించిన భూముల ఆన్‌లైన్ విషయంలో విఆర్‌ఒలు తమ పనితీరు మార్చుకోవాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు కోరారు. ఆదివారం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు విఆర్‌ఒల పనితీరును తహశీల్దార్ డి.రాజేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. ఎంపిపి చలంనాయుడు జోక్యం చేసుకుంటూ విఆర్‌ఒలు పనితీరు మార్చుకోకపోతే సమస్యను జిల్లా ఉన్నతాదికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు. భూముల మ్యుటేషన్‌కు సరైన దస్త్రాలు ఉన్నప్పటికీ విఆర్‌ఒలు తిరస్కరిస్తున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. భూముల మ్యుటేషన్‌కు సంభందించిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాల సమాచారం మండల, గ్రామ ప్రజా ప్రతినిధులకు తెలియజేయకపోవడం దారుణమని కనిమెరక సర్పంచ్ ఎస్ ఆదినారాయణ, అంబటివలస ఎంపిటిసి తాళ్ళపూడి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో నాలుగు జెఎల్‌ఎం పోస్ట్‌లు భర్తీ చేయాలని విద్యుత్ శాఖ ఎఇ జి.శంకర్ కోరారు. ఈ సమావేశంలో ఎమ్‌పిడిఒ గిరిబాల, కార్యాలయ ఎఒ తులసినాద్, ఎపిఒ బి.కృష్ణవేణి, పంచాయతీ ఎఇ అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరంకోట

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ కోరారు. నగరంలోని అయ్యన్నపేటలో నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దొంగతనాల పట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్తలు ఏం తీసుకోవాలి వంటి విషయాలు వివరించారు. సైబర్ నేరాల పట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్